



చేవెళ్లలో కురుస్తున్న వర్షం

చేవెళ్లలో ఈదురు గాలులతో కూడిన వర్షం

చేవెళ్ల/యాచారం, ఏప్రిల్ 18 : ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. గురువారం సాయంత్రం చేవెళ్లలో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు ఆకాశంలో మెరుపులు, ఉరుములతో వానకాలాన్ని తలపించేలా చిన్నపాటి వర్షం కురిసింది. చేవెళ్ల మండలంలో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. షాబాద్, మొయినాబాద్ మండలాల్లో సైతం చిరుజల్లులు కురిశాయి. తాత్కాలికంగా వాతావరణం చల్లబడి జనం కొంత ఉపశమనం పొందారు. ఇటు యాచారం మండలంలోని గున్గల్ రిజర్వ్ ఫారెస్టు నుంచి యాచారం వరకు గురువారం మధ్యాహ్నం 20నిమిషాల పాటు చిరు జల్లు కురిసింది. బుధవారం ఉష్ణోగ్రత 42 డిగ్రీలుండగా గురువారం 40 డిగ్రీలు నమోదైంది. చిరు జల్లు కురిసినా ఉక్కపోతతో జనం ఇబ్బంది పడ్డారు. ఆకాశం మేఘావృతమైనా ఎండ తీవ్రత ఎక్కువే ఉండడం గమనార్హం.

ఈ దృశ్యం చూడడానికి రెండు కళ్లు సరిపోవడం లేదు కదూ..! ఇంతటి పచ్చదనం చూసి కోనసీమ అనుకునేరు.. మన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మైల్వార్-నీళ్లపల్లి సమీపంలోని పంట పొలాలు. యాసంగిలో రైతులు వరి సాగు చేయగా పైరు పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని పొలం గట్లతో ప్రకృతి అందాలు అదరహో అనిపిస్తున్నాయి. మండు వేసవిలోనూ కనుచూపు మేర పచ్చని పైరు కనువిందు చేస్తోంది. ఈ అందాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. చేలు భూమాతకు పచ్చని చీర కట్టినట్టుగా ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు కొద్దిసేపు ఆగి పచ్చదనాన్ని తిలకిస్తూ ఆస్వాదిస్తున్నారు.

- బషీరాబాద్, ఏప్రిల్ 18



పచ్చని కళ



ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

చిలుకూరులో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 18: ప్రసిద్ధ చిలుకూరు బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. బాలాజీ ఆలయంలో ఏటా వారం పాటు జరిగే జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు వేదపండితులు పుట్టమన్నుతో పూజలకు అంకుర్పారణ చేశారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. వేడుకల్లో బాలాజీ ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, ప్రధానార్చకులు రంగరాజన్, ఆలయ కమిటీ సభ్యులు గోపాలకృష్ణపంతులు,స్వామి, సిబ్బంది పాల్గొన్నారు. ఉత్సవాల రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణం, శేషవాహన సేవలు నిర్వహిస్తారు. గరుత్మంతుడికి నైవేద్యం సమర్పిస్తారు. ఈ నైవేద్యాన్ని సంతానం కలగని మహిళలకు పంపిణీ చేస్తారు. ఉదయం 5గంటలకే భక్తులు ఆలయానికి చేరుకుంటుండడంతో ప్రధాన ద్వారం వద్ద టెంట్లు వేయనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా ఈదమ్మ కల్యాణం

కడ్తాల్, ఏప్రిల్ 18 : కడ్తాలలోని ఈదమ్మ ఆలయంలో గురువారం ఈదమ్మ దేవత కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఆరో వార్షికోత్సవాల్లో భాగంగా ఉత్సవాలకు కడ్తాల, సమీప గ్రామాల భక్తులు, వడ్డెరలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్యాణం అనంతరం ఈదమ్మ దేవతకు భక్తులు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులను వడ్డెర సంఘం నాయకులు సత్కరించారు. అనంతరం దేవతకు బోనాల సమర్పించారు. వడ్డెరల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డె రాజు, గండికోట నర్సింహ, బోసు వెంకటేశ్, యాదయ్య, వరికుప్పల సత్యనారాయణ, శ్రీశైలం, రాజు, రేపని యాదయ్య, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జడ్పీటీసీ దశరథ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, నాయకులు వెంకటేశ్, జహంగీర్, భాస్కర్ రెడ్డి, యాదగిరిరెడ్డి, రాజేందర్ గౌడ్, చందోజీ, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, రాంచందర్, సత్యం, మల్లయ్య, శ్రీకాంత్, శేఖర్‌గౌడ్, పి.యాదయ్య పాల్గొన్నారు.



పూజల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీకి అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడింది. 2017 నుంచి ఏటా 18 ఏళ్లు నిండిన పేద మహిళలందరికీ రాష్ట్ర ప్రభుత్వం చీరలు పంపిణీ చేసింది. అయితే గత బతుకమ్మ పండుగ నాటికి 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో సగం మందికి చీరల పంపిణీ జరగలేదు. కార్యాలయాల్లోనే చీరలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో చీరల పంపిణీకి 7,28,000 మంది మహిళలను అర్హులుగా గుర్తించారు. వారిలో చాలా మందికి చీరలందలేదు. చీరల పంపిణీలో డీఆర్డీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసినా వేగంగా చీరల పంపిణీ చేయలేదు. పౌర సరఫరాల శాఖ, రేషన్ డీలర్లు, సెర్ప్, మెప్మా, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖ, మహిళా సంఘాల సహకారంతో పంపిణీ చేయాలని నిర్ణయించినా కార్యాచరణ లోపంతో చీరల పంపిణీ పూర్తి కాలేదు.

- గత అక్టోబరులో ఆడపడచులకు 50శాతం అందజేత
- మిగతా చీరలన్నీ పంచాయతీల్లో కుప్పలుగా దర్శనం
- ఈ చీరలు ఏం చేస్తారని ప్రశ్నిస్తున్న స్థానికులు
- బతుకమ్మ చీరలపై పట్టింపు లేని డీఆర్డీఏ
- చీరల పంపిణీ పథకంతో రూ.కోట్ల మేర ప్రజాధనం వృథా అంటున్న ప్రజలు

బతుకమ్మ చీరలు మూలకు!

ఎన్నికల కోడ్‌తో నిలిచిన పంపిణీ



చేవెళ్ల పంచాయతీ కార్యాలయంలో కుప్పలుగా పడి ఉన్న బతుకమ్మ చీరలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : 2023 శాసన సభ ఎన్నికల కోడ్ రావడంతో గత పండుగకు బతుకమ్మ చీరల పంపిణీ నిలిచింది. ఏటా ప్రభుత్వం బతుకమ్మ పండుగకు 18 ఏళ్లు నిండి రేషన్ కార్డుల్లో పేరున్న మహిళలందరికీ కానుకగా చీరలను అందజేసేది. గత అక్టోబరులో చీరలను పంచాయతీలకు, మున్సిపల్ కార్యాలయాలకు తరలించగా.. మొదట్లో కొందరికి పంపిణీ చేశారు. అంతలోనే 2023 అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో చీరల పంపిణీ నిలిచింది. దీంతో పండుగకు సర్కార్ ఇచ్చే కానుక ఆడబిడ్డలకు అందకుండా పోయింది. జిల్లాలోని 23 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లకు అధికారులు చీరలు సరఫరా చేశారు. జిల్లా వ్యాప్తంగా 7 లక్షల పైచిలుకు మంది మహిళలకు బతుకమ్మ చీరలను అందించాలని నిర్ణయించారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందని ముందే సమాచారమున్నా అధికారుల చీరల పంపిణీలో నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బతుకమ్మ చీరల పంపిణీకి బ్రేక్ పడింది. చాలా మట్టుకు పంచాయతీ కార్యాలయాలు, రేషన్ షాపుల్లో బతుమ్మ చీరలను నిల్వ చేశారు. వచ్చిన వాటిల్లో సంగం పంపిణీ చేసినా మరో సగం చీరలు కుప్పలు తెప్పలుగా కార్యాలయాలు, రేషన్ డీలర్ల వద్ద దర్శనమిస్తున్నాయి. ఎలుకలు, ఇతర కీటకాలకు చీరల కుప్పలు ఆవాసాలుగా మారాయి. జిల్లాలో వంద శాతం బతుకమ్మ చీరలు పంపిణీ చేశామని డీఆర్డీఏ అధికారులు చెబుతుండడం గమనార్హం. మరి ఆఫీసుల్లో కుప్పలుగా పడి ఉన్న చీరలు ఎక్కడివో అధికారులే చెప్పాలి. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చీరల పంపిణీ పథకాన్ని రేవంత్‌రెడ్డి కొనసాగిస్తారా? అనే అనుమానం కలుగుతోంది. మిగిలిన చీరలు ఏం చేస్తారనేది ప్రశ్నగా మారింది.



గత ప్రభుత్వం పంపిణీకి ప్రయత్నించినా ...

ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు అందించడంతో పాటు చేనేత వృత్తిదారులకు ఉపాధి చూపి ఆదుకోవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ గతంలో ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 2017 నుంచి 18 ఏళ్లు నిండిన పేద మహిళలందరికీ బతుకమ్మ పండుగకు చీరలు అందించేంది. 2023లో రూ.350కోట్లు కేటాయించి కోటి చీరల ఉత్పత్తికి ఆర్డర్ ఇచ్చింది. 2023 అక్టోబర్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో పండగకు లబ్ధిదారులకు చీరలను కానుకగా ఇవ్వాలనుకుంది. అంతలోనే 2023 శాసనసభ ఎన్నికల కోడ్ వచ్చింది. ఈ ఎన్నికల్లో బతుకమ్మ చీరల పంపిణీతో బీఆర్ఎస్ పార్టీకి లబ్ధి చేకూరుతుందని, ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలకు అనుమతిచ్చేది లేదని కేంద్ర ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. మహిళలకు చీరలు పంపిణీ చేయాలన్న గత ప్రభుత్వ ప్రయత్నానికి ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. బతుకమ్మ చీల పంపిణీ పథకం పాతదే అని, ఇది యేటా జరిగే కార్యక్రమమే అని అనుమతి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల సంఘం అనుమతి కోరింది. అయినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత చీరల పంపిణీకి అనుమతిచ్చేది లేదని కేంద్రం ఎన్నికల సంఘం ఉత్తర్వులిచ్చింది.

కొత్త ప్రభుత్వంలో పంపిణీకి బ్రేక్!

కాగా రేషన్ కార్డుల ఆధారంగా 18 ఏళ్లు నిండిన వారి జాబితాను అప్పట్లో సిద్ధం చేశారు. జిల్లాలో 7,28,000 మందిని గుర్తించారు. పౌర సరఫరాల శాఖ, రేషన్ డీలర్లు, సెర్ప్, మెప్మా, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాల సిబ్బంది, మహిళా సంఘాల సభ్యుల సహకారంతో పంపిణీ చేయాలని నిర్ణయించారు. కిందామీదా పడి 50 శాతం చీరలను పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ పోయిన తరువాత చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. దీంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బొమ్మతో ఉన్న చీరలను పంపిణీ చేయొద్దని అధికారులకు మౌఖిక ఆదేశాలు రావడంతో చీరల పంపిణీకి ఫుల్‌స్టాప్ పడింది. సగం పంపిణీ చేయగా మిగిలిన చీరలను వాపస్ చేయాలని నిర్ణయించారు. కానీ.. ఇప్పటి వరకు చీరలను వాపస్ చేయలేదు. లక్షల చీరలు పంపిణీ కేంద్రాల్లో ఉండి పోయాయి. కొన్ని చోట్ల చీరలను ఎలుకలు కొడుతున్నాయి. చేవెళ్ల పంచాయతీలో బతుకమ్మ చీరలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. చీరలను సర్పంచ్ చాంబర్‌లో ఓ మూలన ఉంచారు. తిరిగి వాపస్ తీసుకెళ్లాలని అధికారులకు తెలిపినా.. డీఆర్డీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఎన్ని చీరలు పంపిణీ చేశారు?

ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు



బతుకమ్మ చీరల పేరిట గత పాలకులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి దసరా పండగకు బతుకమ్మ కానుకగా కేసీర్ ఇచ్చిన చీర కనీసం ఒక్క మహిళైనా కట్టుకోలేదు. చీరలు బాగా లేవని ముఖం మీదే చెప్పారు. కొందరు ఉచితంగా వస్తుందని తీసుకుని వెళ్లారే తప్ప ఎవరూ కట్టుకోలేరు. తీసుకున్న చీరలను మసి గుడ్డలుగా, చేలల్లో అడవి జంతువుల నుంచి రక్షణగా ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరు కార్లపై, బైక్‌లపై కప్పారు. గత దసరాకు చీరలు చాలా మందికి అందలేదు. పంచాయతీల్లో ఉన్న చీరలను ఏం చేస్తారు? ఇప్పుడు కంపెనీలకు వాపస్ ఇస్తే గవర్నమెంట్‌కు డబ్బులు వస్తాయా? వస్తే తిరిగి ఇచ్చేయండి. లేదా మహిళలకైనా పంపిణీ చేయాలి.

- అశ్విని, లక్ష్మీదేవిపల్లి, జిల్లేడు చౌదరిగూడ మండలం

ఇంకా ఎన్ని మిగిలున్నాయనే లెక్కలు కూడా అధికారుల వద్ద లేకపోవడం విచిత్రం. ఒక్కో చీరకు ప్రభుత్వం 900 రూపాయల వరకు వెచ్చించింది. అయితే తీసుకున్న వారు మాత్రం చీర 150కి మించదు అని విమర్శించారు. అది వేరే విషయం. ప్రభుత్వం అంత ఖర్చుచేసి తెచ్చిన చీరలన్నీ నిరుపయోగంగా మారడంతో మహిళలు, ప్రజలు మండి పడుతున్నారు. 'రాజుల సొమ్ము రాళ్లపాలు' అన్న చందంగా ప్రభుత్వాలు, అధికారుల తీరు ఉందని విమర్శిస్తున్నారు. పంపిణీకి అని చెప్పి తెచ్చి పంచకపోవడం ఒక తప్పయితే ఎన్నికలు పూర్తయినా పంచకపోవడం, కొత్త ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం ప్రజాధనం దుర్వినియోగం తప్ప మరేమీ లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగానూ బతుమ్మ చీరల పరిస్థితి ఇలాగే ఉంది. కాగా బతుకమ్మ చీరల్లో కోట్ల రూపాయల కుంభంకోణం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుంభకోణాన్ని కూడా బయటకు తీయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండు వందలకు మించని చీరలకు 900 ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు స్పందించి పంపిణీ చేయగా మిగిలిన బతుకమ్మ చీరలను తిరిగి వాపస్ చేయాలని, లేదా తీసుకోని మహిళలకైనా పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీరంగాపూర్‌లో తాగునీటి సమస్య

- బోర్లలో పడిపోయిన నీటి మట్టం
- సరిగా సరఫరా కాని భగీరథ నీరు

కొందుర్గు, ఏప్రిల్ 18 : గ్రామంలోని సింగిల్ ఫేజ్ బోర్లలో నీటిమట్టం తగ్గడం.. మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజులకోసారి వస్తుండడంతో శ్రీరంగాపూర్‌లో నీట సమస్య నెలకొంది. మండల పరిధి శ్రీరంగాపూర్‌లో 1,196 జనాభా ఉన్నారు. గ్రామంలో 60వేల లీటర్ల నీళ్ల ట్యాంకు, మరో సంపును ఏర్పాటు చేశారు. గ్రామంలో 8 సింగిల్ ఫేస్ బోరు మోటర్లు ఉన్నా బోర్లలో నీటి మట్టాలు తగ్గి నీరు పోయడం లేదు. మిషన్ భగీరథ ట్యాంక్‌ను ఎత్తు భాగంలో నిర్మించడంతో ఆ ట్యాంకులోకి నీరు ఎక్కక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్యాంకు వద్ద సంపు నిర్మించి దానికి బోరు కనెక్షన్ ఇచ్చారు. మొదట సంప్‌ను నింపి దాని నుంచి నీటిని ట్యాంకులోకి ఎక్కించి పైప్‌లైన్ల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. ట్యాంక్ సమీప ఇళ్లకు నీరు ఎక్కువగా వస్తుంది. ఎత్తు ప్రాంతంలో ఉండే వారికి నీరు రావడం లేదు. కొందరు నల్లా కనెక్షన్ల రెగ్యులేటర్ చెర్రాలు తీసేయడంతో వచ్చిన వారికే ఫుల్ ప్రెషర్‌తో నీరొచ్చి ఎత్తు ప్రాంతానికి నీరు రావడం లేదు. గ్రామంలోని 8 డైరెక్టు బోర్లల్లో నీరు తగ్గింది. 50 ఇండ్ల వారికి నీరు కరువైంది. నీళ్ల ట్యాంకు వద్ద ఉన్న బోరు, పాఠశాల వద్ద, కిష్టయ్య ఇంటి వద్ద ఉన్న బోర్లలో కొద్దిపాటి నీరొస్తుండడంతో సగం గ్రామానికి నీరు అందుతోందని, మరో సగం ఇళ్లకు నీరందడం లేదని గ్రామస్తులు తెలిపారు. భగీరథ ట్యాంకుతో దగ్గరి వారికి 15 బిందెల నీరొస్తే, ఎత్తులో ఉన్న వారికి రెండు బిందెల కూడా రావడంలేదని తెలిపారు. మే నెలలో సమస్య మరింత జఠిలం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్తగా బోర్లు వేసి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఇంటింటికి తిరిగి నల్లాలకు చెర్రాలు తీసిన వాటికి తిరిగి చెర్రాలను బిగిస్తే మరిన్ని ఇళ్లకు నీరు అందుతుందని స్థానికులు అంటున్నారు.



ట్యాంకు పక్కనే ఉన్న నీటి సంప్



శ్రీరంగాపూర్‌లోని మిషన్ భగీరథ ట్యాంక్

పది రోజులుగా నీరు రావడం లేదు



మా కాలనీలో సింగిల్ ఫేజ్ బోరు మోటారులో నీటి మట్టం తగ్గిపోయింది. పది రోజులుగా తాగునీరు అందడం లేదు. ట్యాంకు వద్ద ఉన్న బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. మాకు నీళ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్యాంకు నుంచి వచ్చే నీటి కొందరికే సరిపోతోంది. కొందరు నల్లాల్లో చెర్రలు తీసేయడంతో నీరంతా వారికే పోతుంది. ఎత్తులో ఉన్న వారికి నీరు రావడం లేదు.

- గుడికాడి యాదమ్మ, ఎస్సీ కాలనీ, శ్రీరంగాపూర్

కొత్త బోర్లు వేసేందుకు అనుమతివ్వాలి



గ్రామంలో సింగిల్ ఫేజ్ బోరు మోటర్లలో నీటిమట్టం తగ్గిపోవడంతో పనిచేయడం లేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు ప్రత్యేక అనుమతి తీసుకుని గ్రామంలో తాగు నీటి సమస్య తీర్చేందుకు కొత్త బోర్లు వేయాలి. ఎండలు ముదురుతున్న కొద్దీ నీటి సమస్య తీవ్రం అవుతోంది. అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి.

- భీమిడి రమేష్‌రెడ్డి, శ్రీరంగాపూర్

సమస్యను పరిష్కరిస్తాం



శ్రీరంగాపూర్‌లో కొన్ని వార్డుల్లో నీటి సమస్య ఏర్పడింది. ట్యాంకర్లతో తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తాం. నీటి సమస్య తీర్చేందుకు ఎన్నికల కోడ్ అడ్డు కాదు. నిధులు విడుదల కాగానే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

- ఆంజనేయులు, ఎంపీడీవో, కొందుర్గు

నామినేషన్లు షురూ

- ఎన్నికల అధికారి శశాంకకు అందజేసిన అభ్యర్థులు
- మల్కాజిగిరి స్థానానికి 8 మంది నామినేషన్
- నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- అభ్యర్థి వెంట ఐదుగురికి మాత్రమే అనుమతి

చేవెళ్ల లోక్‌సభ స్థానానికి తొలి రోజు మూడు నామినేషన్లు



పాలమాకుల మధు, ప్రజాబంధు పార్టీ అభ్యర్థి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. చేవెళ్ల స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు చేవెళ్ల స్థానానికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధు ఆర్వోకు నామినేషన్ అందజేశారు. సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.వెంకట్‌రమేష్‌బాబు, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ ముస్తఫా రిజ్వాన్ నామినేషన్ దాఖలు చేశారు. ముగ్గురూ ఒక్కోసెట్ చొప్పున నామినేషన్ వేశారు. నామినేషన్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇతరులను లోపలికి రానివ్వలేదు. అభ్యర్థి వెంట అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించే ఐదుగురిని మాత్రమే అనుమతించారు.

మల్కాజిగిరి స్థానానికి 8 మంది నామినేషన్లు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) : మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి గురువారం మొదటి రోజు 8 మంది 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. బీజేపీ అభ్యర్థులుగా ఈటెల రాజేందర్, ఆయన సతీమణి జమున వేర్వేరుగా నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్రులుగా పాలాది పవన్‌కుమార్, బ్యాగరి లోకేష్, చిలక చంద్రశేఖర్, మాలోత్ శంకర్, పెసరికాయల పరిక్షిత్‌రెడ్డి (రెండు సెట్లు), అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా మేడే సత్యం నామినేషన్ వేశారు. 8 మంది 9 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఇదిలా ఉంటే ఈటల రాజేందర్ నామినేషన్ సమయంలో ఆయన వెంట నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

భారీ ర్యాలీతో నామినేషన్‌కు తరలిన ఈటల

శామీర్‌పేట: ఈటల రాజేందర్ నామినేషన్‌కు బీజేపీ కార్యకర్తల, జన సందోహంతో అర్కల్‌గూడలోని తన నివాసం నుంచి ద్విచక్రవాహన ర్యాలీతో బయల్దేరారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా తూంకుంట నుంచి దొంగల మైసమ్మ చౌరస్తా మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ వేశారు. కాగా ఈటల నామినేషన్ సందర్భంగా శామీర్‌పేటలోని పెద్దచెరువు కట్టమైసమ్మ ఆలయానికి ఆయన సతీమని జమున, కుటుంబీకులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. నామినేషన్ పత్రాన్ని అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, పవన్ గౌడ్, మైసయ్య, రాములు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఉంటే పనిలోకి తీసుకోవద్దు

● వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 18: వేసవిని దృష్టిలో ఉంచుకొని జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు అనారోగ్యంతో ఉన్న కూలీలను పనిలోకి తీసుకోవద్దని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. టెలికాన్ఫరెన్సు ద్వారా బుధవారం మాట్లాడుతూ.. జిల్లాలో పార్లమెంట్ ఎన్నిక ఎన్నికల నేపథ్యంలో డిజిట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. అట్టి నోటిఫికేషన్‌ను ప్రతి ఎంపీడీవో, తహసీల్దార్, ఆర్డీవో, ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిస్‌ప్లే చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లేబర్ మొబిలైసేషన్ జరగాన్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లను బాగుచేయడం, ముండ్ల పొదలు తొలగించడం, ఇరిగేషన్ పనులు జరగాలని, ఇప్పటి వరకు పూర్తయిన పనులకు తప్పనిసరిగా ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, జయసుధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఏఎస్ సాధించిన తరుణ్‌కు సన్మానం


తరుణ్‌ను సన్మానిస్తున్న తిర్మల్‌రావు, ఎండీ ఖలీల్‌పాషా

పూడూరు, ఏప్రిల్ 18: మండలం లోని మంచన్‌పల్లికి తరుణ్ ఐఏఎస్ సాధించడం పట్ల గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన తిర్మలరావు, ఎండీ.ఖలీల్‌పాషా తరుణ్ నివాసానికి వెళ్లి గురువారం పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించారు. వృత్తిలో ఉన్నతస్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు.



బీఫాం అందుకుంటున్న చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫాం

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ఇబ్రహీంపట్నం/చేవెళ్ల, ఏప్రిల్ 18 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బీఫాంలు అందజేశారు. ఈమేరకు మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి స్థానాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, క్యామ మల్లేష్‌లకు తెలంగాణ భవన్‌లో గురువారం బీఫాం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేషం, దయానందర్ గుప్తా, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జి.జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు ఉన్నారు.






కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్

ప్రజలతోనే ఉంటా..
వారికోసమే కొట్లాడతా

- మోదీ చేసిన అభివృద్ధే 'కొండా' గెలుపునకు బాటలు
- దేశంలో మోదీ వేవ్.. నో కరప్షన్.. ఓన్లీ డెవలప్‌మెంట్
- బీఆర్‌ఎస్ వీక్.. కాంగ్రెస్‌తోనే పోటీ..
- ఆరు గ్యారంటీలు అమలు కల్ల రాహుల్ గాంధీ ప్రధాని కావడం అసాధ్యం
- మీడియా సమావేశంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 18 : తాను ప్రజలతోనే ఉంటానని.. వారికోసమే కొట్లాడతానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ చేసిన పనులే తన గెలుపునకు బాటలన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ వేవ్ నడుస్తోందని.. నో కరప్షన్.. ఓన్లీ డెవలప్‌మెంట్ అని చెప్పారు. బీజేపీ విధానం అంత్యోదయ అని చెప్పారు. కాంగ్రెస్‌ది.. చేయి గుర్తు కాదు.. చెంపదెబ్బ గుర్తు అని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం అసాధ్యమని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలుకావన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర నిధులు అన్ని పార్టీల సర్పంచ్‌లకు రాజకీయాలకతీతంగా ఇవ్వడం జరిగిందన్నారు. రూ.11 కోట్ల నిధుల్లో 1,094 పనులకు రూ.7 కోట్లపై చిలుకు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కేవలం 49 పనులు మాత్రమే చేపట్టడం జరిగిందని విమర్శించారు. తాను హైవే ప్రస్తావన పార్లమెంట్‌లో మాట్లాడి తేవడం జరిగిందని, కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేసిన అప్పా జంక్షన్ టూ మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చేతకాలేదని తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధికి వంద కోట్లు తీసుకువచ్చినట్లు చెప్పారు. తాండూరులో నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ 18 నుంచి 5 శాతం వరకు తీసుకు వచ్చినట్లు తెలిపారు. తనను మరోసారి చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. వికారాబాద్ నుంచి తాండూరు వరకు నాలుగు లేన్ల రోడ్డు, శంకర్‌పల్లి నుంచి వయా మోమిన్‌పేట రోడ్డు, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు విస్తరణ పనులు పూర్తిచేయిస్తానని చెప్పారు. శంకర్‌పల్లి నుంచి తాండూరు వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకురావడంలో బీఆర్ఎస్ చేతులెత్తేసిందన్నారు. చేవెళ్లలో త్వరలో బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని,ప్రధాని మోదీ హాజరుకానున్నట్లుచెప్పారు.

బీఆర్‌ఎస్ వీక్.. కాంగ్రెస్‌తోనే పోటీ..

బీఆర్ఎస్ చాలా వీకైందని, కాంగ్రెస్‌తోనే తనకు పోటీ అని కొండా అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అకాక్కులు చవాక్కులు వేయడం సరైంది కాదని, బీఆర్ఎస్ డమ్మీ క్యాండెట్‌ను పెట్టారనటం తప్పు అని, ఆయన పెద్ద మనిషి. ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి అని తెలిపారు.

'69' ఘోరమైన జీవో

ఎన్నికలు వచ్చినప్పుడల్లా జీవో 111పై నేతలు వాగ్దానాలు ఇస్తున్నారని, చేవెళ్ల, రాజేంద్రనగర్ ఎమ్మెల్యేలు యాదయ్య ప్రకాశ్‌గౌడ్‌లు ప్రతి ఎన్నికల్లో ఇదే చెబుతున్నారని తెలిపారు. జీవో 111 రద్దు చేసి అంతకన్నా ఘోరమైన 69 జీవో తీసుకువచ్చారని, ఈ జీవో ఉల్టాపల్టాగా ఉందన్నారు.

కరోనా సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు

కరోనా కాలంలో తాను ఎన్నో సేవలందించినట్లు విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. శానిటైజర్ తయారుపై అవగాహన కల్పించడం, గ్లౌస్, మాస్కులు పంపిణీ చేయడం, చేవెళ్లలో 15 బెడ్లతో ఐసోలేషన్ సెంటర్, డాక్టర్లకు ప్రత్యేక మాస్కులు, మహావీర్ ఆసుత్రిలో 20 నేచురల్ వెంటిలేటర్లు తయారు చేసి అందించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఇండియన్ కొవిడ్ వెంటిలేటర్‌ను తాను తయారు చేయడం జరిగిందన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

శంషాబాద్ రూరల్/రాజేంద్రనగర్ : శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఊట్‌పల్లి, కిషన్‌గూడ, తొండుపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బంజరాహిల్స్‌లోని ఆయన నివాసంలో బీజేపీలో చేరారు. మైలార్ దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది బీఆర్ఎస్ జాగృతి రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కొండా పరమేష్‌గౌడ్, దూదే నర్సింహ, కొడూరి సురేందర్, మల్లేష్‌కుమార్, రామకృష్ణ సిద్దులుగౌడ్‌తో పాటు మరికొంతమంది నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కొండా కండువాలు కప్పి ఆహ్వానించారు మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్, భీమార్జున్‌రెడ్డి, కౌన్సిలర్ కొండా ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

వికారాబాద్ : ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని కచ్చితంగా పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగుర వేస్తామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేందర్ రెడ్డిలు అన్నారు. వికారాబాద్‌లోని గంగారంలోని నాలుగు వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ధారూరు: మండలంలోని చింతకుంట, హరిదాసుపల్లి గ్రామాలలో గురువారం చేవేళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

తాండూరు రూరల్: ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) బీఆర్ఎస్ పార్టీ రాజీనామా చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలోబీజేపీలో చేరారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

మోమిన్‌పేట, ఏప్రిల్ 18: మండలంలోని వెల్చాల్, మొరంగపల్లి గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని చూసి తెలంగాణ రాష్ట్ర ప్రజలు బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మొరంగపల్లి నర్సింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఎర్ర సత్యం, నర్సింహులు, ఆమ్రాది మహేశ్, మండల బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని సాల్విడ్‌లో గురువారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్యరెడ్డి మాట్లాడుతూ మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలు బీజేపీ గెలుపునకు కృషిచేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిని గెలిపించి పీఎం మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, మండల అధ్యక్షుడు సూర్యకాంత్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నర్సింహారెడ్డి, యువ మోర్చా మండల అధ్యక్షుడు గడుసు మహిపాల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, మండల కోషాధికారి కె.మహిపాల్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సాల్విడ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



గుర్రంపల్లిలో మాట్లాడుతున్న డీసీపీ నారాయణరెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

చౌదరిగూడ/కొందుర్గు, ఏప్రిల్ 18 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూడాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కాస్లాబాద్, పెద్ద ఎల్కిచర్ల, గుర్రంపల్లిల్లో ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాల పాఠశాలను డీసీపీ పరిశీలించారు. గుర్రంపల్లి పోలింగ్‌స్టేషన్ వద్ద సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీలు లేని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై నక్రం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, ఆంజనేయులు, ప్రసాద్ ఉన్నారు. అలాగే కొందుర్గులోని జెడ్పీ పాఠశాల పోలింగ్‌స్టేషన్‌ను డీసీపీ నారాయణరెడ్డి సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఆయనతో ఎస్సై కృష్ణయ్య ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో గీతారెడ్డి

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

తలకొండపల్లి, ఏప్రిల్ 18 : ఎరువులు విక్రయించే డీలర్లు రైతులకు రశీదులు తప్పక ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లిలో ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ డీలర్లు నిబంధనలు పాటించాలన్నారు. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. ఈ-పాస్ విధానంలో ఎరువులు విక్రయించాలన్నారు. సాగులో రైతులు మెలకువలు పాటించాలన్నారు. ఆమె వెంట ఏవో రాజు, ఏఈవోలు ఉన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



కుసుమ సముద్రం నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

కులకచర్ల, ఏప్రిల్ 18: వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం గతంలో ఉపాధిహామీ పథకంలో నీటితొట్లు నిర్మించింది. గ్రామాల్లో నీటి సౌకర్యం ఉన్న ట్యాంకులు, పబ్లిక్ కుళాయిల దగ్గర వీటిని నిర్మించారు. కానీ సంబంధిత అధికారులు నీటితొట్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. చాలా గ్రామాల్లో నీటి తొట్లు శిథిలావస్థకు చేరాయి. వాటి నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో కొన్నేళ్లకే చాలా వరకు దెబ్బతిన్నాయి. మండలంలోని చెరువు కుంటల్లో నీరు తగ్గి పోయింది. బోరు బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కుసుమ సముద్రం, అనంతసాగర్, బండవెల్కిచర్ల, అంతారం, సాల్విడ్ గ్రామాల్లో నీటితొట్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణ చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పశువుల దాహార్తిని తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి, సీఐ హనుమాన్‌గౌడ్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 18: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ కె.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడానికి గురువారం మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలను అరికట్టటంతో పాటు నిబంధనలను అతిక్రమించి వాహనాలు తోలేవారి పట్ల తగుచర్యలు తీసుకోవడానికి తమ సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో ప్రయాణం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, శబ్దం ఎక్కువగా వచ్చే సైలెన్సర్లను బిగించడం, గడువు ముగిసిన వాహనాలను రోడ్డుపై నడపటం, అతివేగం, ట్రిబుల్ రైడింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం లాంటివి ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణ కిందికి వస్తాయని తెలిపారు. నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. సైరన్‌లు బిగించుకున్న వాహనాలకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్ సీజ్

కులకచర్ల, ఏప్రిల్ 18: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కులకచర్ల పోలీసులు సీజ్ చేశారు. అనంతసాగర్ గ్రామానికి చెందిన మహేశ్ ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ క్రమంలో విధి నిర్వాహణలో ఉన్న పోలీసులు ఘనపూర్ గేటు సమీపంలో ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమాని మహేశ్, డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఏఆర్‌వో కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహించాలి

వికారాబాద్, ఏప్రిల్ 18: పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు(గురువారం) నుంచి సిబ్బంది ఏఆర్‌వో కార్యాలయం నుంచి ఎన్నికల విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గురువారం జిల్లాలోని వికారాబాద్ నియోజక వర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో మైనార్టీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కొడంగల్/దోమ, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ తహసీల్దార్ విజయకుమార్ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి ఈనెల 25వరకు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ జాబితా ప్రతులను అతికించనున్నట్లు తెలిపారు. మే 13న పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దోమ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ వేస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి

కందుకూరు ఏప్రిల్ 18: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) కోరారు. గురువారం వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎగిరిశెట్టి నర్సింహుల ఆధ్వర్యంలో నేదునూరు పార్టీ అధ్యక్షుడు బొర్ర సురేష్, పార్టీ నాయకులు తుక్కుగూడలోని కేఎల్లార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఐటీసీ సెల్ నేదునూరు శాఖ అధ్యక్షుడు భాస్కర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు జగన్, నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పాటుపడాలి

భారత రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య లౌకికవాద, సామాజిక న్యాయం కోసం ప్రజాప్రతినిధులు, పాలకులు కృషిచేయాలని దళిత, బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు నర్సింహ కోరారు. ఈ మేరకు గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు.

కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయాలి

మహేశ్వరం/మియాపూర్ : మహేశ్వరంలో కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయాలని మండల మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుపల్లి మాజీ సర్పంచ్ సౌడయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రిలతో పాటు మరికొందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ రాకేష్‌రెడ్డి, ఎండీ సాబేర్, ఎర్ర యాదగిరి, కుమార్, రాజు, రమేష్, మహ్మద్, అంజయ్య తదితరులున్నారు. శేరిలింగంపల్లి నియోకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హఫీజ్‌పేట డివిజన్ ఓల్డ్ హఫీజ్‌పేట, రాయదుర్గంలో కార్పొరేటర్ పూజితతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



మహేశ్వరం : కాంగ్రెస్‌లో చేరుతున్న గట్టుపల్లి మాజీ సర్పంచ్ సౌడయ్య, మాజీ ఎంపీటీసీ సావిత్రి

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. కీసరి సంజీవరెడ్డి, షాబాద్ దర్శన్, గౌరి సతీష్, పార్టీ మండలాధ్యక్షుడు మాణెయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

చేవెళ్ల : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని భీంభరత్, చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి కోరారు. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామంలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకర్‌పల్లి మండలం మీర్జగూడ, ఇంద్రారెడ్డినగర్ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి జ్యోతి భీంభరత్, మండల అధ్యక్షురాలు దేవర సమతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సరితా రెడ్డి, చేవెళ్ల, రావులపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

షాబాద్ : కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి చెందుతుందని పామెన భీంభరత్, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన్నసోలిపేట్, పెద్దసోలిపేట్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేష్, ఎంపీటీసీ జయమ్మవెంకట్‌రెడ్డి, నాయకులు జనార్దన్ రెడ్డి, పెంటారెడ్డి, తొంట వెంకటయ్య, సుభాష్‌రెడ్డి, వేణు, చేవెళ్ల స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

వికారాబాద్ : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నవాబుపేట మండలంలోని మమ్‌దాన్‌పల్లి, కుమ్మరిగూడా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, కర్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కులకచర్లలోని పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, జిల్లా యువజన నాయకులు రుతిక్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, బ్లాక్ బీ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ మొగులయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, ఎంపీటీసీ ఆనంద్ పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా మహేందర్



షాబాద్, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన కూతురు మహేందర్‌ను బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్‌లు పదవి ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడుతానన్నారు.

బీజేవైఎం మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా శివప్రకాష్‌రెడ్డి



మహేశ్వరం, ఏప్రిల్ 18 : బీజేవైఎం మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా మండల పరిధిలోని కోళ్లపడకల్ గ్రామానికి చెందిన ఇప్పలపల్లి శివప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేవైఎం కన్వీనర్‌గా బాధ్యతలు అప్పజెప్పినందుకు జిల్లా కమిటీ ఆదేశాను సారం పని చేస్తానన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు పాపయ్యగౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, బొక్క నర్సింహారెడ్డి, టి.యాదీష్, అనంతయ్య ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

'పట్నం' నియోజకవర్గ కన్వీనర్‌గా రవీందర్‌రెడ్డి



యాచారం, ఏప్రిల్ 18 : బీజేవైఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని నజ్దిక్‌సింగారం గ్రామానికి చెందిన వన్నవాడ రవీందర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో చురుగ్గా పని చేయడంతో పాటు పలు ఉద్యమాల్లో పాల్గొనడంతో తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పార్టీ నేతలు, బీజేవైఎం నాయకుల ఆ శల మేరకు నడచుకుంటానన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పని చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు లేవదీస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్‌లకు ధన్యవాదాలు చెప్పారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేవెళ్ల, ఏప్రిల్ 18 : అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల ఫైర్ స్టేషన్ అధికారి భిక్షపతి ప్రజలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం మండల పరిధిలోని కేసారం గ్రామం పరిధిలో ఉన్న గ్లాస్ కంపెనీలో సిబ్బందికి, మండల కేంద్రంలోని పలు కాలనీల్లో, పెట్రోల్ బంకుల్లో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు ఉన్నచోట జాగ్రత్తగా ఉండాలని, చిన్న పిల్లలను వంటగదిలో వదిలిపెట్టకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది దుర్గాదాస్, ప్రశాంత్‌కుమార్, గోపాల్, శివుడు, ఖాజా, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్ తరుణ్‌కు సన్మానం



తరుణ్‌ను సన్మానిస్తున్న కొందుర్గు మండల నాయకులు

చౌదరిగూడ, ఏప్రిల్ 18: యూపీఎస్సీ నిర్వహించిన జాతీయస్థాయి సివిల్స్ ఫలితాల్లో 231 ర్యాంకు సాధించిన తరుణ్ కుమార్‌ను కొందుర్గు మండల పరిధిలోని మూట్పూర్, ఉమ్మెంత్యాల గ్రామాలకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం మంచన్‌పల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్ మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించడం పట్ల నాయకులు అభినందించారు. ఈమేరకు గ్రామానికి వెళ్లి పూలమాల, శాలువాలతో తరుణ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అనెగళ్ళ ఆనంద్, శ్రీనివాస్, నర్సింహులు, శేఖర్, రాజేందర్, రామచంద్రయ్య, రవీందర్, రాజేందర్‌గౌడ్, మల్లయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి

ఆమనగల్లు, ఏప్రిల్ 18: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వాహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని క్లబ్ జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డిలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పోటీ పడాలని కోరారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సందడి నరేందర్‌రెడ్డి గీత దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఆమనగల్లు పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వాహించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ పరీక్షిత్‌తో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాషా, సంయుక్త కార్యదర్శి ఎంగళి బాలకృష్ణ, కోశాధికారి కొరివి వెంకటయ్య, సభ్యులు కర్నాటి కొండల్‌రెడ్డి, ఏలె శివకుమార్, సుధీర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, శేఖర్, వేణు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఘనంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

● మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 18: షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరుడికి పంచామృత అభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, హోమం, ధ్వజాపటాదివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవానికి అంకురార్పణ చేశారు. పట్టణ ప్రముఖులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శారద, పలబట్ల బాల్‌రాజ్ గుప్తా, పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కమ్మదనం సుధాకర్, కానుగు రాం భూపాల్, నర్సింహులు గుప్తా తదితరులు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, తదితరులు

మైసిగండిలో ముగిసిన శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : రాష్ట్రస్థాయిలో ఖ్యాతిగాంచి నిత్యపూజలు, భక్తుల సందడితో భాసిల్లుతున్న కడ్తాల మండలం మైసిగండి రామాలయంలో శ్రీకోదండ రామచంద్రస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. మూడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలలో భాగంగా గురువారం పూర్ణాహుతి, పల్లకీ సేవ, చక్రతీర్థం, పుష్కర స్నానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకీలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పూర్ణాహుతితో ఆలయ ఫౌండర్‌ట్రస్టీ సిరోళి పంతూ బ్రహ్మోత్సవాలను ముగించారు. ఈవో స్నేహలత, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, మాజీ సర్పంచ్‌లు రామావత్ తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, నాయకులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కడ్తాల్ : పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

వార్షికోత్సవాలకు ఆలయాల ముస్తాబు

కడ్తాల్ : మండల కేంద్రంలోని శ్రీ విజయ గణపతి, శ్రీదేవి భూదేవీసమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయాలు వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ద్వితీయ వార్షికోత్సవాల నేపథ్యంలో దేవాలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈనెల 20 నుంచి 22 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త పోకల బస్వరాజ్ రాజమణి దంపతులు వివరించారు. ఈనెల 20 ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకం, సాయంత్రం 6 గంటలకు గోపూజ, ఆలయ ప్రవేశం,మహగణపతి విశ్వక్‌సేన ఆరాధన, గౌరీ పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, 21న ధ్వజారోహణం, మంత్ర పుష్పం, అర్చనలు, కుంకుమార్చన, 22న ఉదయం 11:45 నిమిషాలకు సీతారాముల కల్యాణం, మహబలిహరణం, పూర్ణాహుతి, కుంభాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : వేసవి ఎండల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు చొరవ తీసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో సూర్యరావు సూచించారు. ఎక్కడా కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో శ్రీకాంత్ అధ్యక్షతన తాగునీటి సరఫరా, నిర్వహణపై మిషన్ భగరథ అధికారులు, గ్రామ పంచాయతీల స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ తాగునీటి వనరులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనాభా, కేటాయింపులకు అనుగుణంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూర్యరావు సూచించారు. ఏదైనా కారణం చేత నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే పంచాయతీ పరిధిలోని బోర్ల ద్వారా నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ లలిత, ఎంపీవో శ్రీలత, మిషన్ భగీరథ డీఈ మోహన్‌రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో సూర్యరావు

ఇబ్రహీంపట్నం డివిజన్‌కు పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ

యాచారం, ఏప్రిల్ 18 : ఇబ్రహీంపట్నం డివిజన్‌లో పూర్తిగా నడవలేకుండా ఉన్న దివ్యాంగులు, వృద్ధుల కోసం రెండు వేల పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పంపిణీ చేసినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి తెలిపారు. యాచారం మండలంలో 260 మందికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందించామన్నారు. త్వరలో రెవెన్యూ సిబ్బందిని మండల పరిధిలోని గ్రామాల్లో ఓటర్ల ఇంటి వద్దకు పంపి బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయించుకుంటామని పేర్కొన్నారు.

మండల సమావేశం వాయిదా

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ భవనంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, తగినంత మంది సభ్యులు సమావేశానికి హాజరుకానందున వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు. తిరిగి నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటలకు ఎంపీపీ అనితా విజయ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సభ్యులు సకాలంలో, అన్ని శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ

కొత్తూర్, ఏప్రిల్ 18: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకోవాలని షాద్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి గ్రామంలో నిర్వహించిన శ్రీకాంత్ స్మారక ప్రీమియమ్ లీగ్ క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. మూడు రోజులుగా నిర్వహించిన టోర్నీలో నాలుగు టీంలు తలపడ్డాయి. విజేతగా సన్‌రైజర్ హైదరాబాద్ నిలువగా, రన్నర్‌గా ముంబయి టీం నిలిచింది. విజేత జట్టుకు రూ.15వేల నగదుతో పాటు షీల్డ్, రన్నర్‌కు రూ.10వేలతో పాటు షీల్డ్‌లను ఎమ్మె సత్యనారాయణ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందింపజేస్తాయన్నారు. ఓటమి చెందినవారు నిరుత్సాపడకుండా ముందుకు సాగి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, దేశ స్థాయికి ఎదిగి గ్రామానికి మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. క్రీడాకారులకు ఎల్లప్పుడూ తనవంతు సహాయసహకారాలు అందజేస్తానని అన్నారు. క్రీడాకారులు శాలువలతో సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దాపూర్ మాజీ ఎంపీటీసీ వడ్డే బాలయ్య, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మెండె కృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు కడాల శ్రీశైలం, నాయకులు దేశాల భీమయ్య, ఎమ్మె అజయ్, ఎమ్మె నర్సింహ, జామకాయల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



విరాళం అందిస్తున్న ఆసిఫ్

శంకర్‌పల్లి, ఏప్రిల్ 18 : గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కొత్తపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన రూ.63,000 విరాళం గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకుడు ఆసిఫ్ విరాళం ఇవ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత

కేశంపేట, ఏప్రిల్ 18: పేదింటి ఆడబిడ్డ పెళ్లికి తమవంతుగా నాయకులు చేయూతనిచ్చారు. ఆమె పెళ్లికి అవసరమయ్యే నిత్యావసర సరుకులతో పాటు కొంత నగదు అందించారు. మండల పరిధిలోని మంగళగూడ గ్రామానికి చెందిన దిద్దెల శాంతమ్మ కూతురు స్వాతి వివాహం గురువారం జరిగింది. కేశంపేట మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు రూ.5వేలు, కొట్టం నరేందర్‌రెడ్డి రూ.5వేలు, కొట్టం ప్రభాకర్‌రెడ్డి రూ.2వేలతో పాటు 50 కేజీల బియ్యం, చుక్క రామచంద్రయ్య మరో 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీను, విమోచన గౌడ్, నారాయణరెడ్డి, ప్రకాష్ చారి, కొట్టం విజయ్ కుమార్‌రెడ్డి, బట్టు సుధాకర్, కృష్ణయ్య, పోరండ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

శంకర్‌పల్లి, ఏప్రిల్ 18 : కాలనీ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని కౌన్సిలర్ చంద్రమౌళి తెలిపారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో గున్నాల కృష్ణారెడ్డి బోరు వేయించగా సంకేపల్లి నర్సింలు సమకూర్చారు. ఈమేరకు దాతలతో కలిసి ఆయన మోటార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ రాంచందర్, కార్యదర్శి సంజీవరావు, లక్ష్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

22న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 22న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాషా తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నవారికి ఐవోఎల్ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సరిత

కందుకూరు, ఏప్రిల్ 18 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేకాధికారులు పనిచేయాలని ఎంపీపీ మంద జ్యోతి తెలిపారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కందుకూరు, లేమూరు, గ్రామాల ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్ రెడ్డి, యాదయ్యలు పాల్గొని మాట్లాడారు. ప్రత్యేకాధికారులుగా నియామకమై రెండు నెలలు గడుస్తున్నా ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు తమవంతు పనిచేస్తామన్నారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపీపీ, ఎంపీడీవో సరితలు మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం ప్రతీరోజు 65లక్షల లీటర్ల కృష్ణానీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి ఉన్న కొన్ని గ్రామాల్లో బోర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రత్యేక అధికారికి మూడు నుంచి నాలుగు గ్రామాలను కేటాయించడంతో ఎంపీటీసీలను కలువలేకపోతున్నట్లు చెప్పారు. వచ్చే రెండు నెలల వరకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని కోరారు. ఇందుకోసం మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం కేటాయించినట్లు గుర్తుచేశారు. కాగా, మండల కేంద్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం పోలిస్తే.. నేడు అధికంగా జనాభా పెరిగిందని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో స్పందిస్తూ... ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. మండల సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజశేఖర్ రెడ్డి, సురేష్, ఇందిరదేవేందర్, బాల్‌రాజ్, యాదయ్య, మల్లేష్, ఎల్లారెడ్డి, అచ్చన్న పద్మపాండు, రాజమ్మ, మండల పరిషత్తు కో-ఆప్షన్ మెంబర్ ఎండీ సులేమాన్, అధికారులు పాల్గొన్నారు.

డీకే అరుణ నామినేషన్‌కు తరలిన నాయకులు

కేశంపేట, ఏప్రిల్ 18: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ నామినేషన్ కార్యక్రమానికి గురువారం కేశంపేట మండల బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్‌కి తరలివెళ్లారు. బీజేపీ మండలాధ్యక్షుడు రఘురాములు గౌడ్, రావుల యాదయ్య, పాండురంగారెడ్డి, ఐలయ్య, మోటే శ్రీనివాస్ తదితరులున్నారు.



క్రైం కార్నర్

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : మైనర్‌పై లైంగికదాడి కేసులో మండలంలోని రాంనుంతల పెద్దతండాకు చెందిన బాణావత్ అరుణ్‌కుమార్‌కు సైదాబాద్ జువైనల్ కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.4వేలు జరిమాన విధించినట్లు ఆమనగల్లు ఎస్సై బాల్‌రామ్ నాయక్ తెలిపారు. 2018లో బాలికపై అరుణ్‌కుమార్ లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అప్పటి సీఐ వెంకటేశ్వర్లు దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. ఈమేరకు పూర్వాపరాలు పరిశీలించిన సైదాబాద్ జువైనల్ కోర్టు జడ్జి గురువారం ఏడాది జైలు, రూ.4వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 18: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలో నిషేధిత పేలుడు పదార్థాల(జిలెటిన్ స్టిక్స్)ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిలు గురువారం తెలిపారు. చింతగూడకు చెందిన యాదయ్య రాళ్లు, గుట్టలు పగుల గొట్టేందుకు ఉపయోగించే జిలెటిన్ స్టిక్స్‌ను కలిగి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో వారు తనిఖీ చేయగా అతడి వద్ద 59 జిలెటిన్ స్టిక్స్ లభించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో జింక మృత్యువాత

కొత్తూర్, ఏప్రిల్ 18: మండల పరిధిలోని మక్తగూడ గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున కుక్కల దాడిలో జింక మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మక్తగూడ గ్రామ శివారులో ఓ జింక వస్తుండగా.. కుక్కలు దాడిచేశాయి. తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు జింకకు నీరు తాగించే ప్రయత్నం చేశారు. రెండు గంటల తర్వాత జింక మృతిచెందింది. గ్రామస్తులు కొత్తూర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన జింకను అటవీశాఖ సిబ్బంది శంషాబాద్ సమీపంలో ఉన్న అటవీ పార్కుకు తరలించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

● పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో

కొందుర్గు, ఏప్రిల్ 18: మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన బుడ్డోళ్ల రాజు(23) మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈమేరకు గురువారం రాత్రి సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. అందులో రాజు మాట్లాడుతూ తన కారణంగా ఐదారు నెలల క్రితం ఓ యాక్సిడెంట్ జరిగిందని, ప్రతిఫలంగా బాధితుడికి పరిహారం కింద రూ.5లక్షలు ఇచ్చామని తెలిపాడు. దాంతో తన తండ్రి ప్రతిరోజూ దూషిస్తున్నాడని, తనకున్న బాధలకు మనస్తాపంతో పురుగుల మందు తాగుతున్నానని పేర్కొన్నాడు. చివరగా మద్యం సేవించడం ఆపివేయాలని తన తండ్రిని కోరాడు. కాగా, తాను షాద్‌నగర్ పరిసర ప్రాంతంలో ఉన్నానని.. మిత్రులకు చివరిసారి బైబై చెప్పాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా, రాజు ఆచూకీ కొరకు కుటుంబసభ్యులు, మిత్రులు వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని కొందుర్గు పోలీసులు తెలిపారు. కాగా, అతడు అప్‌లోడ్ చేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● ఎంపీ రాములు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న రాములు, వెంకటరమణారెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 18 : హామీల అమలుపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, కామరెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారిలు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పార్లమెంట్ ఎన్నికలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. మోదీ పదేళ్ల పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందని, ఉత్తర భారత దేశంలో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయిందని, దక్షిణ భారత్‌లోనూ కాంగ్రెస్ కనుమరుగు కాక తప్పదన్నారు. మోదీ, బీజేపీకి దేశంలో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు విషప్రచారానికి ఒడిగట్టారని రాములు, వెంకటరమణారెడ్డి, ఆచారిలు మండిపడ్డారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందని, 12 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని తెలిపారు. ఈ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదన్నారు.

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి సన్మానం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి గురువారం ఆమనగల్లు పట్టణంలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న రమణారెడ్డి స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు గోరటి నర్సింహ, కండె హరిప్రసాద్, లక్ష్మణ్ రావు, శ్రీకాంత్ సింగ్, లక్ష్మణ్, చెన్నకేశవులు, కండెసాయి, ప్రభాకర్, శ్రీధర్, సుండూరు శేఖర్, రాములు, శ్రీశైలం యాదవ్, గిరి, రవిరాథోడ్, అనిల్, గూడూరు గోపాల్‌రెడ్డి, మన్యనాయక్, రాందాస్‌నాయక్, సాయిల్ నాయక్, బక్కి కుమార్, పాండు, శ్రీధర్, కండె సాయి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ద్రోహులకు ప్రజలే బుద్ధి చెబుతారు

● జడ్పీటీసీలు అనురాధ పత్యనాయక్, దశరథ్ నాయక్



మాట్లాడుతున్న అనురాధ పత్యనాయక్, దశరథ్‌నాయక్

ఆమనగల్లు, ఏప్రిల్ 18: ప్రజాదరణ కలిగిన అభ్యర్థులు దొరకక అధికార బలం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్ నాయకులను, ప్రజాప్రతినిధులను తమ తమ పార్టీలోకి తీసుకొని లోక్‌సభ ఎన్నికల బరిలో నిలుపుతున్నాయని జడ్పీటీసీ సభ్యులు అనురాధ పత్యనాయక్, జర్పుల దశరథ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. అధికార దాహం, పదవుల కోసం పార్టీకి ద్రోహం తలపెట్టి.. నీచ రాజకీయాలకు ఒడిగట్టిన నేతలకు ప్రజాక్షేత్రంలో ఓటు అనేక ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలో కడ్తాల వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హామీల అమలు, పాలనాపరంగా విఫలమైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదమని, రాష్ట్రంలో తాగునీటికి, సాగునీటి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో వెల్దండ మాజీ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ కన్వీనర్ పత్యనాయక్, మాజీ సర్పంచ్ సోనాశ్రీనునాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.